# జాతీయ గీతం

ఆ కాగితం మట్టి రంగులో నేలలా వుంది. ఆ కాగితమ్మీద అక్షరాలు చెమ్మతగలగానే మొలుస్తున్న వాడియైన మొలకల్లా పచ్చగా కళకళ్ళాడుతున్నాయి. ఆ అక్షరాలు కత్తిమొనల్లా మెరుస్తున్నాయి. ఆ కత్తి మొనల వేపు చూశాడు వాడు. ఆ అక్షరాలు వాడికేం అర్థం కాలేదు. ఆ అక్షరాల్ని చూస్తుంటే వాటిలో వాడికి తండ్రి కన్పించాడు. జుత్తుని ప్రేమగా నిమిరి, కళ్ళల్లోకి అభిమానంగా చూసే తండ్రి కన్పించాడు. వాడికి ఆ అక్షరాల్లో తల్లి కన్పించింది. మొన్నటి వరకూ ఒడిలో పడుకోబెట్టుకుని పాలుపట్టిన చల్లటితల్లి జ్ఞాపకానికొచ్చింది.

తనచేతిని చూసుకోవడానికి వాడికి భయం వేసింది. చుట్టూ చూశాడు. చేతి పిడికిట్లో కాగితాన్ని వుంచుకుని, ఆ చేతిని వెనక్కి దాచేసుకుని ముందుకు నడిచాడు. వాడికి నడవడం నచ్చలేదు. తండ్రి ఎప్పుడు ఇంటికి వచ్చినా, ఎప్పుడు ఇంట్లోంచి వెళ్ళినా, పరుగు పరుగునే వచ్చేవాడు. పరుగు పరుగునే వెళ్ళేవాడు. తండ్రిలాగే వాడికీ పరుగెత్తాలనిపించింది.

ఆ పల్లెనుంచి మహానగరానికి వెళ్ళేరోడ్డు మంచిగా లేదు. ఆ రోడ్డు పాడైపోయింది. ఆ రోడ్డు చచ్చిపోయింది. ఇప్పుడప్పుడే ఆ రోడ్డును ఎవరూ బాగు చేయలేరు. ఆ రోడ్డు మీద లేతాకుల్లా రెండు అడుగులు. ఎంతకూ తరగని ఆ రోడ్డు మీద ఆయాసం వచ్చేంత వరకూ పరుగెత్తి ఆగాడు వాడు. వెనక్కిచూశాడు. ఊరి వెనక నల్లటి కొండలు. వాడికవి బళ్ళో నల్లబల్లల్లా కన్పించాయి. ఆ కొండ మీద తెల్లటి ఎండ చారలు.

తండ్రిఎప్పుడొచ్చినా ఆ కొండలమధ్య దార్లోంచి వచ్చేవాడు. ఆ రోజు తండ్రి వస్తాడని తల్లి చెప్పింది.ఇంటి ముందు నులక మంచమ్మీద తండ్రి

కోసం ఎదురుచూస్తూకూర్చున్నాడు. సోములు, రాము, సాంబు 'బడికి రావా' అని వాళ్ళింటిమీంచి వెళ్ళేటప్పుడు అడిగారు కూడా. 'ఇవాళ మా నాన్నొస్తాడు. బడికి రాను' అన్నాడు వాడు. సోములువాళ్ళు సాయంత్రం గుడి దగ్గర ఆడుకుంటున్నప్పుడు కూడా పిలిచారు. 'మీ నాన్నొచ్చినప్పుడు వెళ్ళొచ్చులే, ఆడుకుందాం రా' అన్నారు. అర నిమిషంలో వచ్చి వెళ్ళిపోయే నాన్న తనాడుకుంటున్న సమయంలోనే వచ్చి వెళ్ళిపోతే! అంచేత రానన్నాడు వాడు. దూరంగా వాళ్ళు ఆడుకుంటున్న ఆటల్ని చూస్తూ కూర్చున్నాడు.

"తిండి తిందూగాని రా'' అని లోన గుడిసెలోంచి తల్లి పిల్చింది. కాస్సేపట్లో చీకట్లో కల్సిపోవడానికి సిద్ధంగావున్న కొండలవేపు, ఆకొండలమధ్య సన్నగా కనిపించే చిన్న దారివేపు మరోసారి చూసి లోనికెళ్ళాడు.

"నాన్న రాడా అమ్మా ఇవేళ''అన్నంగిన్నెముందు కూర్చుంటూ అడిగాడు వాడు. వాడివేపు చూసింది. "వస్తాడు'' అంది తల్లి. రెండు రోజుల్లో వస్తానన్నవాడు పది, పన్నెండు రోజులకి, నెల్రోజులకి వచ్చిన సంధర్భాలున్నాయి. "నేను అన్నం తిని పడుకుండి పోయాననుకో..అప్పుడు నాన్నొచ్చాడనుకో... నన్ను లేపుతావా.'' అన్నం ముద్ద తినబోతూ అడిగాడు వాడు.

"అలాగేలే.. తిను'' బుడ్డి దీపాన్ని వాడిముందుకు జరిపింది తల్లి.

అతనెక్కడున్నాడో, ఎలా వున్నాడో, భర్తని చూసినప్పుడల్లా ఒకటే ఆశ్చర్యం ఆమెకు. తన తిండి గురించి, నిద్ర గురించి, దాహం గురించి ఎప్పుడూ ఆలోచించడతను. ఒకరోజు అర్థరాత్రి బయటికెళ్ళడానికి సిద్ధంగా వున్న భర్తని ఆమె అడిగింది.

"అందర్లా నువ్వూ వుండొచ్చు కదా...'' అని? "నాలా అందరూ వున్నారా" ఎదురు ప్రశ్న వేశాడు. నిద్రపోతున్న కొడుకుని చూస్తూ.

"అంటే?" ఆ మాట అర్థంకాలేదావిడకి.

"అందర్లా నేనెలా వుండగల్ను. నాలా కొంతమంది మాత్రమే వున్నారు. వాళ్ళతోనే నేనుండగల్ను.'' ఆమె కళ్ళవేపు చూస్తూ ఆ మాటన్నాడు. ఆ తర్వాత మరేం మాట్లాడకుండా అతను బయటికెళ్ళిపోయాడు. ఇద్దరి మధ్యా చాలా దూరం వుంది.

చటుక్కున ఏవో అడుగుల శబ్దం వినిపించింది. తలెత్తి ద్వారబంధం వేపు చూసిందావిడ. రెండో ముద్ద నోట్లో పెట్టుకోబోతున్న కొడుకు కూడా అటువైపు చూశాడు. గబుక్కున లోని కొచ్చాడా వ్యక్తి. అతన్ని చూసి ఆవిడ

లేచి నిలబడింది. గాభరాగా రెండు నిముషాల్లో చెప్పాల్సింది ఆమెతో చెప్పేసి వీలైతే మళ్ళీ వస్తాను జాగ్రత్త అని బయటికొచ్చి అటూ ఇటూ చూసి చీకట్లోకి వెళ్ళిపోయాడు.

"నాన్న రాడా అమ్మా. బాబయ్య వెంటనే ఎందుకెళ్ళిపోయాడు?" తల్లివేపు చూస్తూ అడిగాడు. తల్లి జవాబు చెప్పలేదు. మళ్ళీ అడిగాడు వాడు. తల్లి జవాబు చెప్పలేదు. నాన్న రాడేమో అన్పించింది వాడికి. అలాఅన్పించగానే వాడి చేతిలో ముద్ద గిన్నెలోకి జారిపోయింది.

ఆ వ్యక్తి భర్త గురించి చెప్పి వెళ్ళిపోయిన తర్వాత ఆవిడకేం చేయాలో తోచలేదు. గుండెల్లో చెమట పట్టింది. " రాజన్నని పోలీసులు తీసుకెళ్ళారని తెలిసింది. ఎక్కడున్నాడో తెలీదు. కనుక్కోవడానికి ప్రయత్నిస్తున్నాం. వీలైతే మళ్ళీ వస్తాను, జాగ్రత్త."

రాజన్న ఎక్కడున్నాడో తెలీదు. ఎలా వున్నాడో తెలీదు. ఆవిడ మనసులో ఏదో ప్రసవవేదన.గుడిసె బయటికొచ్చి చూసి, గుడిసె లోపల కొంతసేపు పిచ్చిదాన్లా తిరిగింది.

భర్త ఎక్కడున్నాడో కనుక్కోవాలి. గబుక్కున కొడుకునితీసుకుని బయటికొచ్చిందావిడ. చుట్టూ నత్తగుల్లల్లా గుడిసెలు నిద్రపోతున్నాయి. చీకట్లో దారి.

"ఎక్కడ కెళ్తున్నావమ్మా?" కొడుకడిగేడు. "నాన్న దగ్గరికి." ఆ మాట వాడికి వెలుగులా వుంది.

ఊరికి వంద గజాల దూరంలోకి వచ్చిందావిడ. రోడ్డుకి కుడివేపున వెన్నెల్లా తెల్లగా మెరిసిపోతూ ఓ పోలీస్ స్టేషన్ వుంది. ఆ స్టేషన్ వరండాలో వెలుగుతున్న తెల్లటి విద్యుద్దీపాల కాంతి తెల్లటి గోడల మీద పడి చీకట్లోకి ప్రతిఫలిస్తోంది.

ఆ స్టేషన్ ముందుకొచ్చిందావిడ. మనుషుల అలికిడి లేదక్కడ. స్టేషన్ మెట్ల మీద ఓ జాతికుక్క మేలైన పోజులో హాయిగా విశ్రాంతి తీసుకుంటోంది. ఆడ మనిషి అడుగుల శబ్దం వినగానే అది కళ్ళిప్పి చూసి పక్కకు తప్పుకుంది. అరుస్తూ ఆడమనిషి వేపు పిల్లాడివేపు చూసింది. అప్పుడు దాని పళ్ళు క్రూరంగా కన్పించలేదు.

మెట్ల మీద కిటికీలోని గదిలోకి తొంగి చూసిందావిడ.

ఎవర్నైనా పిలుద్దామని ఆవిడ అనుకుంటున్న సమయంలో... "ఎవరమ్మా

ఏంకావాలి?'' అని అడుగుతూ లోన్నించో పోలీసు కానిస్టేబుల్ వచ్చాడు. అతని మాటల్లో వినయం కన్పిస్తోంది. అతని మాటల్లో తాగుడు వాసన ప్రసరించడం లేదు.

"ఎస్.ఐ. గారున్నారా... మాట్లాడాలి.'' అని అడిగిందావిడ.

"లేరమ్మా'' అని చెప్పాడతను. "మీరు నిలబడే వున్నారేం'' అని గాభరాగా కొంచెం దూరంలో వున్న కుర్చీని తెచ్చి "కూచోండి'' అని చెప్పాడు.

"ఎస్.ఐ.గారూ, హెడ్డుగారూ డ్యూటీ మీదే బయటి కెళ్ళారమ్మా, వాళ్ళు రెండ్రోజుల్నుండి ఇంటిమొహం కూడా చూడకుండా డ్యూటీ పనిమీదే తిరుగుతున్నారమ్మా... మంత్రిగారొస్తే... అక్కడికి గంట క్రితమే వెళ్ళారమ్మా... ఇప్పుడైనా రావొచ్చు, ఎప్పుడైనా రావచ్చు... ఉదయమైతే దొరుకుతారు'' అని, "చాలా దూరంనుంచి నడిచొచ్చినట్టుగా తమరు కన్పిస్తున్నారు'' అని అడిగి, వెంటనే లోనికెళ్ళి గ్లాసు కడిగి, కూజాలోని మంచినీళ్ళు తెచ్చి ఆవిడకిచ్చాడు.

"నీళ్ళు చేదుగా వున్నాయి కదమ్మా... మూడ్రోజులై కూజాలో నీళ్ళు మార్చలేదమ్మా. ఏవనుకోవద్దు మీరు.'' అని సంజాయిషీ చెప్పాడు.

కానిస్టేబుల్తో మాట్లాడి ఆమె మెట్లు దిగుతుండగా అప్పుడే అక్కడికి ఓ స్కూటరు వచ్చి ఆగింది. ఆ స్కూటరు చూసి ఆవిడ మెట్లమీద నిలబడిపోయింది. ఆ కానిస్టేబుల్ స్కూటర్ మీద వ్యక్తిని చూసి సెల్యూట్ చేశాడు. ఆ స్కూటరు మీద నుంచి ఓ ఆజానుబాహుడు, వంద కిలోల భారీకాయుడు దిగాడు.

ఆయన కళ్ళు చల్లగా దీపాల్లా వున్నాయి. ఆ కళ్ళల్లో దయ ప్రసరిస్తోంది.

"వీరు మీ కోసం వచ్చారు'' అని కానిస్టేబుల్ ఆవిడని చూపిస్తూ అన్నాడు.

ఆ ఎస్.ఐ. తనచేతిలో అప్పటి వరకూ వున్న సిగరెట్ పారేసి "చెప్పండమ్మా'' అని ఆవిడను చూస్తూ అడిగాడు.

"రాజన్న అని నా భర్తని పోలీసులు తీసికెళ్ళారని తెల్సింది. ఎక్కడున్నారో తెల్సుకుందామని, చూద్దామని వచ్చాను'' అని ఆవిడ చెప్పింది.

ఎస్.ఐ రెండు నిమిషాలు ఆలోచించాడు.

"రాజన్న గారి భార్యా మీరు... రాజన్న గారిని పోలీసులు తీసికెళ్ళారా... నాకు తెలీదే... రాజన్న గారిని తీసికెళ్తే రూల్స్ ప్రకారం నేను తీసికెళ్ళాలే..'' అని ఎస్.ఐ. "నేను కనుక్కొని మీకు ఇన్‌ఫాం చేస్తాను. కంగారుపడకండి'' అన్నాడు. తర్వాత మళ్ళా "పాపం చీకట్లో మీరొక్కరూ వచ్చినట్టున్నారు.

అసలే ఈ ఊళ్ళో లైట్లు కూడా బాగాలేవు. రండి... మీ ఇంటి వరకూ తోడొస్తాను...పదండి..." అన్నాడు ఎస్.ఐ.

ఆవిడ పిల్లాడిని ఎత్తుకుని వెనక నడవగా ఎస్.ఐ. ముందు నడుస్తూ ఆవిడకి దారి చూపించాడు. ఆవిడని ఇంటి దగ్గర దిగబెట్టాక "వెళ్ళొస్తానమ్మా... రేపుదయం నేనొచ్చి రాజన్నగారి ఆచూకీ చెప్తాను... వస్తానమ్మా నమస్కారం" అని ఆవిడకు రెండు చేతుల్తో నమస్కరించి ఎస్. ఐ. వెళ్ళిపోయాడు.

కనుగుడ్ల మీదికి రెప్పల్ని లాక్కున్నా ఆ రాత్రంతా ఆవిడకి నిద్రరాలేదు. గోడమీద బల్లిలా ఆవిడ గుడిసెలో తిరుగుతూనే ఉంది. పోలీసు స్టేషన్లో కానిస్టేబుల్, ఎస్.ఐ. తనపట్ల ప్రవర్తించిన తీరు ఆమెకు గుండు సూదుల్లా గుచ్చుకుంటూనే వుంది.

"డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్‌కి వెళ్తే మీకేదైనా విషయం తెలిస్తే తెలవ్వొచ్చు" అని పోలీస్ కానిస్టేబుల్ పరాగ్గా అన్న మాట ఆవిడలో గింగుర్లు తిరుగుతోంది. అక్కడ కూడా పరిస్థితి ఇలాగే వుంటే... పరిస్థితి ఇలాగే వుంటుంది. అయినా తప్పదు.

తెలతెలవారుతోంది. గవర్నమెంటు ఉద్యోగిలా తాపీగా సూర్యుడు లోకమ్మీదకు అడుగుపెడుతున్నాడు.

పిల్లాడ్ని తీసుకుని బయల్దేరిందావిడ.

బస్సుదిగి నరకంలా వున్న బస్టాండులో ఓ మూల నిలబడింది. అటూ ఇటూ చూసింది.

పక్కనేవున్న టీ బడ్డీ దగ్గర ఓ వ్యక్తి టీ తాగుతున్నాడు.

అతన్ని అడిగింది.

అతడు ఆమెను తేరిపార చూశాడు. ఆమె వివరాలు కనుక్కొని అతను విచారించేడు.

"అయ్యోపాపం. అంత దూరనుంచి శ్రమపడివచ్చారా. మీ ఊళ్ళో వున్న మావాళ్ళ నెవర్నడిగినా చెప్పేవారే... నిన్న నేను నైట్ డ్యూటీయే చేశానే. రాజన్న అనే వ్యక్తిని మా వాళ్ళెవళ్ళూ తీసికొచ్చినట్టు లేరే. అయినా కనుక్కుందాం రండి..."అని మఫ్టీలో వున్న ఆ పోలీస్ కానిస్టేబుల్ అమిత దయతో పిల్లాడి రెక్కపుచ్చుకుని నడిపిస్తూ, ఆమెకు సానుభూతి చూపిస్తూ పోలీస్ స్టేషన్‌కి తీసికెళ్ళాడు.

పోలీస్ స్టేషన్ చక్కగా రాజమహల్లా వుంది. ఆ రాజమహల్లో వరండా

దాటి వెళ్ళాక ఓ విశాలమైన హాలుంది. ఆ హాల్లో అటూ ఇటూ అందమైన సోఫాలున్నాయి. ఆసోఫాల మీద ఒక వేపు కాకీ రంగు దుస్తుల్లో ఇద్దరు పోలీస్ అధికారులు, ఎదురుగా వున్న ఇంకో సోఫా మీద స్వచ్ఛమైన ధవళ వస్త్రాల్లో ఓ నలుగురు వ్యక్తులు కూర్చొని వున్నారు. ధవళ వస్త్ర వ్యక్తుల చేతుల్లో సిగరెట్లున్నాయి.

అందులో ఒక ధవళ వస్త్ర వ్యక్తివేపు చూసాడు ఒక పోలీసు అధికారి. ఆ వ్యక్తివేపు చూసి పోలీసు అధికారి యిలా అన్నాడు –

"ఆ దేవాలయంలో బంగారు విగ్రహం మీరు ఎత్తుకుని వెళుతుండగా పూజారి కూడా చూశాడు. మీతాలూకాలో వున్న 26 దేవాలయాల్లోని వాటినీ కరిగించి అమ్మేసుకున్నారని అభియోగం. దీనిపై మీ సంజాయిషీ ఏమిటి?" అని అడిగాడు మర్యాదగా ఆ దొంగని.

వార్డు మెంబరుషిప్ కోసం గుడిసెలంటించానంటే ఒప్పుకుంటాను. ఛైర్మన్ పదవి కోసం కొట్లాటలు జరిపించానంటే ఒప్పుకుంటాను. ఎమ్మెల్యే పదవికోసం హత్యలు జరిపించానంటే ఒప్పుకుంటాను. కాని మహాప్రభో గుళ్ళో బంగారు దేవుణ్ని ఎత్తుకెళ్ళి జాతి ద్రోహం చెయ్యలేదు. నమ్మండి. మీ పెద్దల సాక్షిగా, పెద్ద మంత్రిగారిసాక్షిగా నేనంత నీచానికి దిగజారానని మీరు అనుకుంటే సరి... మీరు కానిస్టేబుల్‌గా వున్న దగ్గర్నుంచి నేను దొంగతనాలే చేస్తున్నాను. ఏనాడైనా ఇలాంటి పాపపు పనిచేశానా సి.ఐగారూ" అని ఆ పక్కన కిళ్ళీ నవులుతున్న సి.ఐ.వేపు చూశాడు ధవళ వస్త్ర వ్యక్తి.

"నిజం ... నిజం..." అని సి.ఐ. గారు అన్నారు.

"మీరు దొంగతనం చెయ్యలేదని మాపై అధికారుల సాక్షిగా చెప్పారు కాబట్టి నమ్ముతున్నాను.... మీ మాటల్లో నిజమే నాకు విన్పిస్తోంది.... మీరు వెళ్ళండి" అని ఎస్.ఐ. అన్నాడు, వెంటనే మరో ఆలోచన లేకుండా.

ఆ సమయంలో పోలీస్ కానిస్టేబుల్, ఆ ఆడమనిషిని అక్కడికి తీసికెళ్ళాడు.

"ఎవరు వీరు?" అని ఎస్.ఐ. అడిగాడు.

"పెద్దయ్యగార్ని కలవడానికి వచ్చారు" అని కానిస్టేబుల్ అన్నాడు. "లోనికి తీసుకెళ్ళు" అని పక్కనే వున్న సి.ఐ. అన్నాడు.

ఆ హాలుకి ఆనుకుని వున్న ఓ గదిలోకి తీసికెళ్ళాడు కానిస్టేబుల్.

ఆ గది విశాలంగా వుంది. ఆ గది అందంగావుంది. ఆ గదిలో ఒక పక్క విశాలమైన టేబుల్ ముందు రివాల్వింగ్ కుర్చీలో అయిదుపదుల వ్యక్తి కూర్చుని వున్నాడు.

ఆడమనిషి వచ్చిన పనిని పెద్దయ్యగారితో చెప్పేసి కానిస్టేబుల్ బయటికి వచ్చేశాడు.

ఆ తర్వాత...

ఒక ఎస్.ఐ. తన సీట్లోంచి లేచి"రండి కూర్చోండి" అని ఆవిడతో చెప్పాడు.

పెద్దయ్యగారు ఆవిడను చూసి వినయంగా మర్యాదగా ఆవిడ వచ్చిన పని గురించి అడిగారు.

ఆ పెద్దయ్యగారు చెప్పిన మీదట ఇంకో చిన్నయ్యగారు పాయింట్లను నోట్ చేసుకున్నారు.

ఆయన అడిగిన వాటి కన్నింటికీ ఆవిడ జవాబు చెప్పింది.

"రాజన్నగారిపేరు నేను విన్నానమ్మా... వారంటే నాకు గౌరవం... మన పెద్ద మంత్రిగారు చెప్పినట్లు ప్రజల కోసం ఆలోచించే ప్రతివారూ దేశభక్తులే. అలాంటప్పుడు మేమేం చెయ్యగలవమ్మా.. ఏం చెయ్యలేం, వారు కన్పిస్తే భక్తితో నమస్కరించడం తప్ప. కానీ రాజన్నగారిని మేం తీసికెళ్ళలేదమ్మా. కంగారు పడకండి. మీకెవరో తప్పుడు వార్త చెప్పారు. అయినా అమ్మా.. ఇంకో విషయం..." అని చెప్పబోతుండగా ఇంతట్లో ఒక కానిస్టేబుల్ కప్పుతో కాఫీ తెచ్చి ఆవిడకిచ్చాడు.

పెద్దయ్యగారు తమప్రసంగం కొనసాగించేడు.

"పుకార్లు కానీ ఆక్షేపాలు కానీ అభియోగాలు కానీ ఇవ్వన్నీ మా డిపార్ట్‌మెంట్ మీద ఎక్కువైపోయాయమ్మా... అదే నా బాధ... మీ భర్తగారికొచ్చిన ప్రమాదమేమీ లేదు. నమ్మండి" అని ఎస్.పి.గారు కొండంత మాటల నమ్మకాన్నిచ్చేరు ఆవిడకి.

ఆ తర్వాతావిడ వెళ్ళొస్తానన్నట్టుగా నమస్కరించింది - అక్కడున్న అధికారులకు.

"మీరు శ్రమపడి ఇంతదూరంవచ్చారు... పాపం మీరు మన జీపులో వెళ్ళండి" అన్నారు ఎస్.పి.గారు మళ్ళీ.

"వద్దండి... బస్సులో .." ఆవిడ ఇంకేదో అనబోయింది.

"లేదమ్మా... మాదగ్గరకు ఎవరు ఫిర్యాదు చేయడానికొచ్చినా ఆ పనయ్యాక, మేం సగౌరవంగా ఇళ్ళకు దిగబెడతాం. అందులోనూ ఈ పోలీసులన్నల దగ్గరకొచ్చిన ఆడపడుచులు మీరు..." అని కూడా అన్నాడు, బండ పెదవుల మీదకు వెండిచిర్నవ్వును పులుముకుంటూ.

ఆవిడ పిల్లాడిని తీసుకుని గదిలోంచి బయటికొచ్చింది.

48 గంటలైంది భర్తని పోలీసులు తీసికెళ్ళారన్న వార్తతెలిసి. ఏ క్షణమైనా ఏమంచి మాటైనా భర్త స్నేహితులు వచ్చిచెప్తారని ఆశతో కొన్ని గంటల పాటు గుమ్మం ముందు కూర్చుంది ఆవిడ. ఎవరూ రాలేదు.

అప్పుడే చటుక్కున ఆవిడకో ఆలోచనొచ్చింది. లోన గుడిసెలో కొడుకు నిద్రపోతున్నాడు. వాడివేపు ఒకసారి చూసి బయటికొచ్చింది.

ఊరికి ఎడమవేపు పెద్ద బంగళా వుంది. ఆ బంగళాలో ఊరి పెద్ద రాజుగారు వుంటున్నారు. ఆయనకో యాభై ఏళ్ళుంటాయి. ఆవిడ ఆ బంగళా కెళ్ళి ఆయన గురించి వాకబు చేసింది.

"లేరమ్మా.... మంత్రిగారొస్తే గెస్ట్ హౌస్ కెళ్ళారు. అక్కడికెళ్ళండి." అని రాజుగారింట్లో చెప్పిన మీదటావిడ ఆ గెస్టుహౌసు కెళ్ళింది.

ఆ గెస్టహౌసు ముందు చాలా విదేశీ, స్వదేశీ కార్లున్నాయి. ఆ గెస్టహౌస్ గేట్ ముందు చాలా మంది మనుషులున్నారు. అక్కడ రాజుగారి గురించి వాకబు చేస్తే అక్కడి మనుషులు వెంటనే ఆవిడని లోనికి వెళ్ళమని చెప్పారు.

మెట్లెక్కి ఒక విశాలమైన గదివేపు నడిచిందావిడ. గదిముందు ఒక జవాను హుందాగా నిలబడున్నాడు. వాడామెను చూడగానే మర్యాదగా వివరాలడిగేడు.

ఆ తర్వాత -

"లోనికెళ్ళండి... రాజు గారితో పాటు మంత్రిగారు కూడా లోనున్నారు..." అని చెప్పి జవాను తలుపు తీసి లోనికి దారి చూపించాడు.

లోన ... గదిలో -

విశాలమైన పరుపు మంచమ్మీద మంత్రిగారు మఠం వేసుకుని కూర్చుని వున్నారు. ఆ మంచానికి ఎదురుగా ఖరీదైన కుర్చీల్లో రాజుగారు, కొంతమంది పరివారం కూర్చుని వున్నారు.

ఆవిడ లోనికి రావడం అందరూ చూశారు.

"చెప్పమ్మా... ఏం కావాలి... ఎవరు మీరు?" అని రాజుగారే ఆమెను దయగా ప్రశ్నించారు.

చెప్పిందావిడ.

ఆవిడ మాటలు విన్నాక చిన్నగా నవ్వుతూ రాజుగారు "చూడమ్మా ... ఆయన మన మంత్రిగారు. మీరు చెప్పింది వారుకూడా విన్నారు... దానికి జవాబు వారే చెప్పగలరు" అని చెప్పి మంత్రిగారి వేపు చూశారు.

మంత్రిగారి వేపు తిరిగి నమస్కరించిందావిడ.

"మీరు రాజన్నగారి భార్యా" అని మంత్రిగారు లేచి, "నమస్కారమమ్మా" అని కూర్చొని, "కూర్చోండి" అని ఆవిడకు ఒక ఖరీదైన కుర్చీ చూపించేరు.

ఆ తర్వాత అక్కడే వున్న తమ కార్యదర్శిని పిల్చి "చూడండి మొదలియార్ గారూ! వీరి భర్తగారిని మన పోలీసులు తీసికెళ్ళారని వీరు పేర్కొంటున్నారు. ఆ రాజన్న గారిని ఎవరు తీసికెళ్ళారో, ఎందుకు తీసికెళ్ళారో, ఎక్కడున్నారో కనుక్కొని అయిదు నిమిషాల్లో చెప్పండి...అలాగే ఎస్.పి. గారిని ఒకసారి రమ్మనమని చెప్పండి" అని ఆజ్ఞాపించారు.

మొదలియార్ గారు బయటికెళ్ళారు.

ఆ తర్వాత మంత్రిగారు అక్కడే వున్న ఓ జవాను వైపు చూశారు. ఆ చూపుల్లోని ఆజ్ఞని శిరసాస్వీకరించి ఆ జవాను రెండు నిమిషాల్లో ఒక చల్లటి పానీయాన్ని ఆవిడకిచ్చాడు.

"స్వీకరించండి..." మర్యాదగా అన్నారు మంత్రిగారు.

అయిదు నిమిషాల్లో వెనక్కి వచ్చారు మొదలియార్‌గారు.

"రాజన్నగారిని పోలీసులు తీసికెళ్ళలేదని ఎస్.పి.గారు చెప్పారండి... వారిప్పుడు వస్తానన్నారు..." అని చెప్పారు.

"మీరు విన్నారు కదమ్మా... రాజన్నగారిని తీసికెళ్ళలేదటమ్మా... అయినా కనుక్కొంటాం... ఇంకేమైనాఫిర్యాదుందా?" అని మంత్రిగారు అడిగారు.

"లేదండి" అని అక్కడున్న వారందరికీ నమస్కరించింది.

మంత్రిగారు లేచి నమస్కరించారు.

60 గంటలైంది. భర్తని పోలీసులు తీసికెళ్ళారన్న వార్త తెలిసి. ఏ క్షణాన్నైనా ఏ మంచి మాటైనా భర్త స్నేహితులు చెప్తారని ఆశతో కొన్ని గంటలపాటు గుమ్మం ముందు కూర్చుంది ఆవిడ. చీకటి పడింద. ఆవిడ మనసులో భయం కడుపులో పేగు కదిలినట్టు అన్పించిందావిడకు. ఒళ్ళంతా ఎందుకో చెమట్లు పట్టాయి.

భర్త ఏమయ్యాడు? ఏమయ్యాడు!

పదిహేనేళ్ళ బాల్యాన్ని బాధల్లోగడిపేసి, పదేళ్ళ ఆలోచనని బాధల కంకితం చేసి, నిప్పుగుండం బతుకుని నిండు గుండెతో ఆహ్వానించి, మసక పొరల్లేని మాయల్లేని మాలిన్యం లేని వెలుగుకోసం నడిచే రాజన్న ఏ పెనుచీకటి ఊబిలో చిక్కుకుపోయాడు? రాజన్న ఏమయ్యాడు?

అంతట్లో ఏవో అడుగుల చప్పుడు విన్పిస్తే ఆశగా చూసిందావిడ. ఆ వ్యక్తి దాదాపు పరుగెడుతున్నట్లుగా వచ్చాడు. అతను చెమటలోంచో రక్తంలోంచో తీసిన మనిషిలా ఉన్నాడు.

"వదినా... ఘోరం... జరిగిపోయింది.. అన్నయ్యని పోలీసులు కాల్చేశార్ట.... ఇప్పుడే... ఇప్పుడే తెల్సింది." ఆ వ్యక్తి చెప్పాడు. "చిట్టి కొండల పక్కనున్న అడవిలో ... గంటయిందట...." అని కూడా చెప్పాడు. ఇంకేదో చెప్పబోయాడు–

కానీ ఆవిడక్కడ లేదు. భర్త ఎప్పుడు వచ్చే కొండలదారి ఆవిడకు తెల్సు. ఆ వెనకున్న అడవులన్నీ తెల్సు.

ఆ దార్లోనే ఆవిడుంది.

చీకటి నల్లగా వుంది. గాలి సత్తుగా వుంది. ఆ గాల్లో నెత్తుటి వాసన. చీకట్లో కన్నీటి ముద్దలా ఆవిడ. రాళ్ళు రప్పలు ముళ్ళ కంపలు దాటుతూ కొండల మధ్యనుంచి అడవిలోకి దారి తీసిందావిడ.

పెను కేకపెట్టింది. ఆ కేక పచ్చటి ఆకుల పొత్తి కడుపుల మీద ప్రతిధ్వనించింది. ఆ కేక పరుగెడుతున్న ఆవిడ కాళ్ళవేళ్ల మధ్యనుంచి జారిపడుతున్న ఇసుక రేణువుల్లో ప్రతిధ్వనించింది.

నిశ్శబ్దాన్ని పులుముకున్న అడవిలో వేర్లనుంచి శిరసుదాకా విషాదాన్ని మోస్తున్నట్టుగా చెట్లు. ఓ చెట్టుముందు నిలబడిందావిడ. ఆవిడ చూపులు మేల్కొన్న ఆకుల్లా వాడిగా వున్నాయి.

ఎక్కడా మనిషి అలికిడి లేదు. శక్తిని నరనరానా కూడదీసుకుని మళ్ళీ పెనుకేక వేసిందావిడ. ఎక్కడో ఒక రెమ్మ తెప్పరిల్లి చిన్న శబ్దం చేసి జవాబు చెప్పింది. అంతే.

మళ్ళీ కేక వేయడానికి ప్రయత్నించి ఆవిడ ఆగిపోయింది.

ఆవిడ నరంలో భయం ఒక్కసారి ప్రవహించింది. ఆవిడ కళ్ళల్లో దుఃఖం జలజలాకారింది.

ఆవిడ అరికాళ్ల కింద చల్లగా ఉంది. అది నీరు కాదని ఆవిడ చటుక్కున గుర్తుపట్టింది. కళ్లుచిట్లించుకుని చూసింది. ఒంగొని చేత్తో అక్కడి మట్టి ముద్దని తీసుకుని చూసింది. ఆ మట్టి ముద్దవేడిగావుంది. ఆ మట్టి ముద్ద ఎర్రగా వుంది. అదిరక్తం. అది తన భర్త రక్తం. తను తన రక్తాన్ని గుర్తుపట్టగలదు.

పిడికిలిలో రక్తంముద్ద. అది భర్త గుండెకాయిలా అన్పించిందావిడకు. ఒకసారి ఆ నేలమీద పడిపోయింది.

కొన్నినిమిషాలు గడిచాయి. సేద తీరి చుట్టూ చూసింది.

ఆవిడ గుండె చప్పుడే అడవిలో ప్రతిధ్వనిస్తోంది.

చీకట్లో ఏడుస్తూ, రాళ్ళమీంచి నడుస్తూ, ముళ్ళ మీంచి నడుస్తూ, రక్తంలా పారే ఏటిపక్కనుంచి నడుస్తూ, పడుకున్న చెట్లపక్కనుంచినడుస్తూ, ఉలిక్కిపడి లేచిచూసే పిట్టల పక్కనుంచి అడివంతా తిరిగింది ఆ తల్లి. ఆ తల్లికి అడవి తల్లి నిజం చెప్పలేదు. భర్తనిచూపించలేదు. మళ్ళీ చెట్టు దగ్గరకొచ్చింది.

మట్టిలోకి ఇంకిపోతున్న రక్తాన్ని ముట్టుకుని చూసింది. చుట్టూ వెతికింది. అక్కడ చెట్ల వేళ్ల పక్కన పెన్ను కన్పించింది. దాన్ని పోల్చుకుంది. ఆ పెన్ను పక్కన....

కొన్ని కాగితాలు. అవి మట్టి రంగులో నేలలా వున్నాయి. వాటిమీద అక్షరాలు చెమ్మ తగలగానే నేలమీద మొలుస్తున్న పచ్చటి మొలకల్లా వున్నాయి. వాటివేపు ప్రేమగా చూసిందావిడ. వాటిలో భర్తని ప్రేమగా చూసుకుందావిడ. ఆ కాగితాల్ని ఏరి చేతిలోకి తీసుకుందావిడ.

ఒకసారి, ఇంకొకసారి, మరొకసారి ఆ చెట్టు వేళ్ళలోకి ఇంకుతున్న భర్త రక్తంవేపు చూసి వెనుదిరిగింది.

తెల్లగా పగలుంది.

ఆ పగటి వెలుతురులో ఎండుతూ ఆవిడ నడుస్తోంది. నడుం నొప్పెడితే అంతవరకూ ఎత్తుకున్న కొడుకుని దించి, నడచిన దారిని చూసింది. ఆదార్లో ఎవరూ లేరు. ముందుకి చూసింది. భర్త నడుస్తున్నట్లుగా అన్పించింది.

చేతిలోని కాగితాలవేపు చూసింది.

"మన గొంతుల్లోంచి మాటల్ని రానీయకుండా, మన గుండెల్లోకి ప్రాణవాయువును పోనీకుండా, మన నడకలో మనల్ని నడవనీయకుండా, మన కళ్ళతో మనల్ని చూణ్ణీయకుండా చేస్తున్న వాళ్ళే మనకి శత్రువులని ప్రతి ఒక్కరికీ తెలవడానికే ఈ కాగితాలు. ప్రతి ఒక్కరికీ ఈ కాగితాలు అందాలి. నేలమీద విత్తుల్లా ఆలోచన మొలవాలి... అందుకనే వెళ్తున్నాను. మన సభలు జరిగిన మర్నాడే నేనొచ్చేస్తాను..బాధలు కొన్నేళ్ళేలే.." అయిదు రోజుల క్రితం ఓ తెల్లవారుఝామున భర్త వెళ్తూ అన్న మాటలివి.

'ప్రతి ఒక్కరికీ ఈకాగితాలు అందాలి..' దృఢంగా నిశ్చయించుకుందావిడ.

కొడుకుచెయ్యి పట్టుకుని నడిపిస్తూ తను నడుస్తోంది. వాళ్ళిద్దరూ ఆకాగితాల్లోని అక్షరాలు లేచి నడుస్తున్నట్టుగా వున్నారు.

ఫర్లాంగుదూరం నడిచింది.

ఎదురుగా చూసింది. రోడ్డు మొదట్లో మలుపు దగ్గర వికృతంగా రాబందులా ఏదో కన్పించింది.

ఆవిడ కొడుకువేపు ప్రేమగాచూసి కొడుకుచేయి పట్టుకుని ముందుకు నడిచింది ధైర్యంగా.

అది రాబందు కాదు, పోలీసు జీపు. అది వాళ్ళిద్దరి పక్కన ఆగింది. అందులోంచి ఎస్.ఐ.గారు, ఇద్దరు కానిస్టేబుళ్ళు దిగారు.

ఎస్.ఐ ఆవిడకి నమస్కరించాడు. కానిస్టేబుళ్ళు వినయంగా ఆవిడకిరుపక్కలా నిల్చున్నారు.

“అయామ్‌వెరీ సారీ మైడియర్ సిస్టర్..రాజన్న గార్ని ఎవరో గుర్తు తెలీని వ్యక్తులు పాత కక్షల కారణంగా చంపేశారమ్మా...శాంతిభద్రతల్ని కాపాడేందుకు ఎంత శాయశక్తులా ప్రయత్నిస్తున్నప్పటికీ జరిగేవి జరిగిపోతున్నాయమ్మా .... రాజన్నగారి హత్య వెనుక అంతర్జాతీయ శక్తుల హస్తముందని పెద్ద మంత్రిగారు కూడా అభిప్రాయం వ్యక్తపరిచారమ్మా..ఇది గోండమ్మా...అందుకోండి. రాజన్నగారి మృతికి కకావికలైన గుండెతో పెద్ద మంత్రిగారు తమ కుటుంబ సభ్యులకు సంతాప సందేశాన్ని అందజేయమన్నారమ్మా.. ” అని ఎస్.ఐ. ఆ సంతాప సందేశాన్ని అక్కడే మొహం మాడ్చుకుని విషాదంగా చదివాడు.

ఆవిడామాటల్ని వినలేదు. సందేశాన్ని విన్పించుకోలేదు. ఆ సమయంలో ఆవిడ తన కుడిచేతి పిడికిట్లో వున్న కాగితాన్ని వెనక్కి దాచేసింది.

ఎస్.ఐ. .ఆ కాగాతాన్ని చూసేడు. స్పష్టంగా చూశాడు. అంతవరకూ ఆయన ముఖంలో వున్న విషాదం రౌద్రంగా మారిపోయింది.

“చూడమ్మా... మన ఆడపడుచులు హాయిగా ఇళ్ళ ముంగిళ్ళలో ముగ్గులు పెట్టుకుంటూ, వంట గదుల్లో ఊరగాయల్ని సర్దుకుంటూ, బట్టల కొట్లల్లో చీరల్ని ఎంపిక చేసుకుంటూ, సిన్మాతారల గురించి మాట్లాడుకుంటూ చక్కగా నిష్పూచీగా వుండాలమ్మా... కానీ ఇలాంటి హానికరమైన కాగితాల్ని పట్టుకోగూడదమ్మా... తప్పు” అని ఎస్.ఐ.ఆమె చేతినుంచి బలవంతంగా ఆకాగితాల్ని లాక్కోడానికి ప్రయత్నించాడు. పిడికిల్లో కాగితాల్ని గట్టిగా పట్టుకుని ఒక్కసారి వెనక్కి పరుగెట్టిందావిడ.

★ ★ ★

పావుగంట గడిచింది.

విశాలమైన రోడ్డుమీద వాడు నిలబడి వున్నాడు. వాడి చుట్టూ చిరిగిపోయిన కాగితాలు. ఆ చిరిగిన ముక్కలు ముక్కలైన కాగితాల మధ్య ఓ చిరగని కాగితం. ఆ కాగితం జెండాలా రెపరెపలాడుతోంది. ఆ కాగితాన్ని చూశాడు. వాడు చేతిలోకి తీసుకున్నాడు.

వాడు తన చేతిని ఒకసారి భయం భయంగా చూసుకున్నాడు.

పది నిమిషాల క్రితం నిర్జనంగా, దేశమంత విశాలంగా వున్న రోడ్డుమీద నిస్తేజంగా పడిపోయిన తల్లి..రక్తసిక్తమైపోయిన తల్లి .. బూటు కాళ్ళకింద నలిగి నలిగి కాగితాల్ని జారవిడిచి అరిపోయిన దీపం వత్తుల్లా తల్లి చేతి వేళ్ళు ఊపిరి చూపుతో జీపులోంచి తనవేపు చూసిన తల్లి వెచ్చని కళ్ళు...

వాడికి తన అరచేతిలో, కాగితంలో కన్పించాయి.

గట్టిగా ఊపిరి తీసుకుని, కళ్ళు తుడుచుకున్నాడు. విశాలమైన రోడ్డ మీద పచ్చటి మొలకలా వాడు. ఆ రోడ్డుమీద లేతాకుల్లా వాడి రెండుపాదాలు.

ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక - *1987*

*